ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
కామారెడ్డి జిల్లా వార్తలు
5
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.5, కనిష్ఠం 27.6
గురువారం 18 ఏప్రిల్ 2024

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

పిట్లం, ఏప్రిల్ 17: మండలంలోని కుర్తి గ్రామ శివారు వద్ద బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం అదుపు తప్పి రోడ్డు పక్కనే గల పొలాల్లోకి వెళ్లింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ నుంచి పిట్లంకు వస్తున్న బస్సు కుర్తి శివారులో బస్సు అదుపు తప్పడంతో ప్రయాణికులు ఒక్క సారిగా భయాందోళనలకు గురయ్యారు. బస్సు రోడ్డు పక్కకు దిగడంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరుగపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ జాగ్రత్తగా బస్సు నవడపంతో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని వారు తెలిపారు.



నేడే నోటిఫికేషన్

- నేటి నుంచి లోక్‌సభ నామినేషన్ల స్వీకరణ
- సంగారెడ్డి కలెక్టరేట్‌లో నామినేషన్లు దాఖలు చేయనున్న అభ్యర్థులు
- ఎంపీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 913 పోలింగ్ స్టేషన్లు
- జహీరాబాద్ ఎంపీ సెగ్మెంట్‌లో 16 లక్షలకు పైగా ఓటర్లు
- మహిళల ఓట్లే కీలకం
- లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమైన రాజకీయ పార్టీలు
- ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేసిన అభ్యర్థులు

కామారెడ్డి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల చేయనున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికల అధికారిగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వ్యవహరించనున్నారు. ఆయా రాజకీయ పార్టీల నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే వారు ఎలక్షన్ అధికారి దగ్గర నేటి నుంచి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఎంపీ సెగ్మెంట్ పరిధిలోని ఇరు జిల్లాల అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. అదేవిధంగా రాజకీయ పార్టీలు సైతం ఎన్నికలకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలకు చెందిన ఎంపీ అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

సంగారెడ్డిలో నామినేషన్ల స్వీకరణ

జహీరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉంది. జహీరాబాద్ సంగారెడ్డి జిల్లాలో ఉన్నందున అక్కడి జిల్లా కలెక్టరే ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఏఆర్వోగా ఉంటారు. నెలరోజుల కిందటే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగా 7 విడతల్లో ఎన్నికలు నిర్వహించనుంది. నాలుగో విడతలో తెలంగాణ లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. జహీరాబాద్ ఎంపీ నియోజకవర్గ ఎన్నికల అధికారి గురువారం నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఎంపీ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నామినేషన్ల ప్రక్రియ 25 వరకు కొనసాగనుంది. మే 13న పోలింగ్ జరుగనుంది.

ఎంపీ సెగ్మెంట్‌లో 16 లక్షలకు పైగా ఓటర్లు


జహీరాబాద్ ఎంపీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటాయి. కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలు, సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఈ జహీరాబాద్ ఎంపీ నియోజకవర్గం పరిధిలో మొత్తం 16,32,266 ఓట్లు ఉండగా ఇందులో పురుషుల ఓట్లు 7,97,700, మహిళల ఓట్లు 8,33,951 ఉన్నాయి. థర్డ్ జండర్‌వి 63 ఓట్లు ఉన్నాయి. జహీరాబాద్ ఎంపీ సెగ్మెంట్ పరిధిలో మెజార్టీ ఓట్లు కామారెడ్డి జిల్లా పరిధిలోనే ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో మొత్తం 4 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం ఓట్లు 8.75 లక్షలకు పైగా ఉండగా సంగారెడ్డి జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 7.50 లక్షలకుపైగా ఓట్లు ఉన్నాయి. ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎక్కువగా మహిళల ఓట్లు ఉన్నాయి. అనగా ఈ ఎంపీ సెగ్మెంట్ పరిధిలో అభ్యర్థుల గెలుపోటములను మహిళా ఓటర్లే నిర్దేశించనున్నారు.

ఇప్పటికే ప్రజల్లోకి..

జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థులను ప్రధాన పార్టీలు ఎన్నికల షెడ్యూల్ వెలువడకముందే ప్రకటించాయి. అంటే దాదాపు సుమారు 2 నెలల క్రితమే బీజేపీ, కాంగ్రెస్ తమ అభ్యర్థులను ముందుగానే ప్రకటించగా షెడ్యూల్ వెలువడిన తర్వాత బీఆర్ఎస్ తమ అభ్యర్థిని ఎంపిక చేసింది. దాదాపు నెలరోజుల కిందటే ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ అభ్యర్థి మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్, బీఆర్ఎస్ తరఫున గాలి అనిల్‌కుమార్ బరిలో ఉన్నారు. వీరంతా ఇప్పటికే పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజల్లోకి వెళ్తు తమను గెలిపించాలంటూ అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరఫున మంత్రి రాజనర్సింహతో పాటు ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం చేపడుతున్నారు. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలు హరీష్‌రావు, కేటీఆర్‌లు ఇప్పటికే ఓ విడతలో ప్రచారం నిర్వహించగా ఎంపీ బీబీ పాటిల్ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. ఇప్పటికే ఆయా పార్టీలు తమ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు సన్నాహక సమావేశాలను పూర్తి చేశారు. ఇక ఇంటింటా ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు.

ఎవరి వ్యూహం వారిదే..

పార్లమెంట్ ఎన్నికల్లో విజయాన్ని సొంతం చేసుకోవడానికి ఎవరికి వారు ఎత్తుకు పై ఎత్తులు వేయనున్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తున్నారు. ఇక రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలు గెలిస్తేనే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు సాధించుకోవచ్చని, నిర్ణయాత్మక శక్తిగా మారే అవకాశం ఉంటుందని ఓటర్లకు వివరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉన్నందున వారి మద్దతుతో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ ప్రజల్లోకి వెళుతున్నారు. మున్ముందు నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ తమకు కలిసోస్తుందని భావిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలు ఎంపీగా పని చేసిన బీబీ పాటిల్ వైఫల్యాలను, సమస్యలను ఎత్తిచూపి జనాదరణ పొందాలని బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ భావిస్తున్నారు. ప్రజాధరణ కల్గిన పార్టీ అధినేతలను రప్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్, బాన్సువాడ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే గెలవడంతో ఆ పార్టీకి ఈ ఎన్నికలు కలిసి వస్తాయని భావిస్తున్నారు. బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీ పాటిల్ సిట్టింగ్ ఎంపీగా కొనసాగడంతో కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో సంబంధం ఉండటంతో పార్లమెంట్ ఎన్నికలు తమకు కలిసి వస్తాయని భావిస్తోంది. రెండు పర్యాయాలుగా కేంద్రంలో అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, ఇతర ప్రజాసంక్షేమ పథకాలపై ప్రచారం చేయనున్నట్లు ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఈ ఎన్నికల్లో మూడు పార్టీల నుంచి ముగ్గురు ప్రముఖులు ఆర్థిక బలం ఉన్న నేతలే బరిలో దిగడంతో పోటీ త్రిముఖంగా మారే పరిస్థితులు లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.





డోంగ్లీలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 17: జిల్లాలో ఈ వేసవి కాలంలో బుధవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా సరాసరి అత్యధిక ఉష్ణోగ్రత 42.6 డిగ్రీలుగా నమోదు అయింది. జిల్లాలోని 24 ప్రాంతాల్లో 40 డిగ్రీలపై ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా డోంగ్లీలో 44.2 ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఎల్పుగొండలో 43.0 రామారెడ్డిలో 42.9, బిచ్కుందలో 42.6, హసన్‌పల్లి, దోమకొండలో 42.4, పాత రాజంపేటలో 42.3, భిక్కనూర్‌లో 42.2, ముక్తపూర్‌లో 42.1, మేనూర్‌లో 41.8, తాడ్వాయిలో 41.7, గాంధారిలో 41.6, బీర్కూర్‌లో 41.0, పెద్దకొడప్గల్, బీబీపేట్, పిట్లంలో 40.9, లింగంపేటలో 40.8, జుక్కల్, మాచాపూర్‌లో 40.6, కోల్లూర్‌లో 40.5, నస్రుల్లాబాద్‌లో 40.4, నాగిరెడ్డిపేట, షుల్కల్, 40.3 అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం, 33.6 నుంచి 36.1 వరకు నమోదవుతున్నాయి. గత రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఎండలు మండిపోతుండంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 17: కామారెడ్డి మండల పరిధిలోని పలువురు నాయకులు బుధవారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గర్గుల్ మాజీ సర్పంచ్ రవితేజగౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మామిళ్ల అంజయ్యలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని రాబోయే రోజుల్లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానం కైవసం చేసుకోవడం కోసం అందరూ ఒకేతాటిపైకి వచ్చి కష్టపడి పని చేయాలన్నారు. పది సంవత్సరాల తర్వాత కేసీఆర్ పొలంబాట పట్టి రైతుల వద్దకు వెళ్లేలా చేసిన ఘనత కాంగ్రెస్ కార్యకర్తలకు దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబరు 7న ఏర్పడిందని చలికాలంలో వర్షాలు ఎప్పుడు పడ్డాయని కాంగ్రెస్ వచ్చింది కరువు తెచ్చిందని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. గత ఏడాది వర్షాకాలం సమయంలో అధికారంలో ఉన్నది కేసీఆర్ ప్రభుత్వమే కదా మరి కాంగ్రెస్ వస్తే కరువు వచ్చిందని ఎలా అంటున్నారని అన్నారు. 64లక్షల 75వేల మంది రైతులకు రైతుబంధు వారి అకౌంట్లలో వేయడం జరిగిందని రైతుబంధు పొందే మొత్తం రైతుల సంఖ్య 69 లక్షలుగా ఉందని తెలిపారు.


షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న దృశ్యం



అంగరంగ వైభవంగా..

రాములోరి కల్యాణం


కామారెడ్డిలో పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

- ప్రత్యేక పూజా కార్యక్రమాలు
- శ్రీరామ నామస్మరణలో తరించిన భక్త జనులు
- జిల్లా కేంద్రంలో శ్రీరామ సేన ఆధ్వర్యంలో విగ్రహాలతో భారీ ర్యాలీ
- శ్రీరామ స్మరణలతో మారుమోగిన జిల్లా
- ర్యాలీలో వేలాదిగా పాల్గొన్న యువకులు
- వీధులన్నీ కాషాయమయం
- ఆలయాలకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీల ప్రతినిధులు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 17: జిల్లాలో సీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు స్వామి వారి కల్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లోని ఆలయాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ధర్మశాల వద్ద నుంచి శ్రీరామసేన ఆధ్వర్యంలో పెద్దఎత్తున శ్రీరాముడి శోభాయాత్ర నిర్వహించగా ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ఎంపీ బీబీ పాటిల్ ఈ యాత్రను ప్రారంభించారు. ఈ శోభాయాత్రలో యువకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో, ధర్మశాలలో, రామాలయంలో, పంచముఖి హనుమాన్, శ్రీరాంనగర్ కాలనీలో, సీతారామంజనేయాలయం, అడ్లూర్, చిన్నమల్లారెడ్డి, లింగాపూర్ వెంకటేశ్వరాలయంలో తదితర ఆలయాలను అందంగా అలంకరించబడిన ముత్యాల పందిరిలో వేలాదిగా భక్త జనులు చూడగా సీతారాముల కల్యాణం ఘనంగా వేద పండితులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా వందలాది జంటలు పాల్గొని సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. అమ్మ వారికి భక్తులు ఓడి బియ్యం, పట్టువస్త్రాలు సమర్పించి వారి మొక్కులు తీర్చుకున్నారు.

కామారెడ్డిలో వైభవంగా శ్రీరాముడి శోభాయాత్ర

శ్రీరామనవమి పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా కేంద్రంలో శ్రీరామసేన ఆధ్వర్యంలో శ్రీరాముడి, హనుమాన్, వీరశివాజీ విగ్రహాలతో భారీ ఎత్తున శోభాయాత్రను నిర్వహించారు. శోభాయాత్ర ధర్మశాల నుంచి ప్రారంభం కాగా సిరిసిల్లా రోడ్డు, పాత బస్టాండ్, స్టేషన్ రోడ్డు, సుభాష్‌రోడ్డు, పాంచ్ చౌరస్తా, హరిజనవాడ, ముదాంగల్లి, హనుమాన్‌గల్లి, పెద్దబజార్, రైల్వేబ్రిడ్జి మీదుగా నిజాం సాగర్ చౌరస్తా, దేవునిపల్లి వరకు చేరుకుని ర్యాలీని ముగించారు. ఈ ర్యాలీలో వేలాదిగా వచ్చిన యువకులు భక్తి పాటలతో, నృత్యాలతో ముందుకు కదిలారు. అంగరంగ వైభవంగా యాత్రను చేపట్టడంతో వివిధ గ్రామాల నుంచి యువకులు పట్టణానికి చేరుకొని శ్రీరామ స్మరణలు, జోర్ సే బోలో ప్యార్ సే బోలో... జై శ్రీరాం.. జై శ్రీరాం.. మేబీ బోలో తుమ్ బీ బోలో.. జై శ్రీరాం.. జైశ్రీరాం అంటూ జయ జయ నాదాలతో, కాషాయపు జెండాలతో జిల్లా కేంద్రం మొత్తం మారుమోగింది. మహారాష్ట్ర నుంచి వచ్చిన కళాకారుల బృందం చేసిన విన్యాసాలు, డప్పు వాయిద్యాలు భక్తులను, యువకులను పెద్ద ఎత్తున ఆకట్టుకున్నాయి.

కామారెడ్డిలో సీతా రాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు





కామారెడ్డిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

వ్యవసాయ రంగాన్ని ప్రైవేటుకు అప్పగించేందుకు కుట్ర

● కిసాన్ సంయుక్త మోర్చా రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్

పెద్దబజార్, ఏప్రిల్ 17: వ్యవసాయ రంగాన్ని పెట్టుబడిదారులకు అప్పగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని కిసాన్ సంయుక్త మోర్చా రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్ అన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లాకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతువ్యతిరేక విధానాలకు పాల్పడి 750మంది రైతులను బలితీసుకుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మోదీ సర్కార్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. ఎంపీ అర్వింద్ రైతులను మోసం చేశాడని అన్నారు. సమావేశంలో ఎస్‌కేఎం నాయకులు వెంకట్రాములు, దేవరాం, వేల్పూర్ భూమయ్య, కంజర్ భూమయ్య, గంగాధర్, వెంకటేశం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.ప్రభాకర్

గ్రంథాలయ భవనంలో బోరు ఏర్పాటు

రుద్రూరు, ఏప్రిల్ 17: మండలకేంద్రంలో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి బుధవారం బోర్‌ను డ్రిల్లింగ్ చేయించారు. గ్రంథాలయంలో నీటి వసతి లేకపోవడంతో 8నెలలుగా నిరుపయోగంగా ఉంది. ఈ సమస్యను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్ ఇటీవల ఏనుగు రవీందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారులను సంప్రదించి బోరును వేయించారు.

జిల్లా వ్యాప్తంగా ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్

బోధన్‌రూరల్,ఏప్రిల్17: బోధన్ పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంతో పాటు సాలూర, బోధన్ మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శక్కర్‌నగర్ రామాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని చూడడానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీగా సంఖ్యలో తరలివచ్చారు. అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. రామ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అనంతరం విశ్వహిందు పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వీరహనుమాన్ విజయ యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు.



ఆర్మూర్‌లో తలంబ్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి



ఖిల్లా డిచ్‌పల్లి రామాలయంలో దేవుని కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ఖిల్లా డిచ్‌పల్లి రామాలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



ఖిల్లా రామాలయంలో ఎంపీ అర్వింద్ పూజలు

డిచ్‌పల్లి,ఏప్రిల్17: చారిత్రాత్మక ఖిల్లా డిచ్‌పల్లి రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు బుధవారం అంగరంగవైభోపేతంగా సాగాయి. రామాలయంలో సీతరాముల వేడుకలను పురష్కరించుకొని పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. ఉదయం 11గంటలకు శ్రీరాముని జననం (డోల రోహనం) నిర్వహించగా,12.01 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు సుమిత్ శర్మ దేశ్ పాండే ఆధ్వర్యంలో వేద పండితులు సీతరాముల కల్యా ణం నిర్వహించారు. సీతరాముల కల్యాణం భక్తుల జయజయ ధ్వానల నడుమ రాముడు సీతమ్మ తల్లిమెడలో తాళికట్టారు. రామనవమి సందర్భంగా ఆలయ ప్రధాన ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్తా కుటుంబ సభ్యులు సీత రాములకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు, పుస్తే మట్టెలు సమర్పించారు.

● కల్యాణ వేడుకల్లో పాల్గొన్న బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు

సీతరాముల కల్యాణ వేడుకలను బీజేపీ ఎంపీఅభ్యర్థి అర్వింద్, బీఆర్ఎస్ఎంపీఅభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌లు వేర్వేరుగా హాజరైప్రత్యేకంగా తిలకించారు.

● కల్యాణ వేడుకల్లో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి

ఖిల్లా డిచ్‌పల్లి రామాలయంలో జరిగిన సీతరాముల కల్యాణోత్సవంలో స్థానిక ఎమ్మెల్యేభూపతిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..శ్రీరామ చంద్ర స్వామి అనుగ్రహంతో ప్రజల అంత సుభిక్షంగా ఉండాలని,భగవంతున్ని ఆకాంక్షించారు. ఖిల్లా రామాల యాన్ని పర్యటక క్షేత్రంగా తీర్చిదిద్దెల చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

● ధర్మారం(బి) ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు

శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఇటీవలే నూతనంగా తీసుకొచ్చిన సీతరాముల కు ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రావుల బ్రహ్మానందం వేద బ్రహ్మణులచే నవమి వేడుకలను వైభోపేతంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం సీతరాముల కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సిద్దులగుట్ట రామాల యంలో సీతరాముల కళ్యాణోత్సవానికి ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హాజరై తలంబ్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిచే ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం గోవింద్‌పేట్‌లో పిప్రి, మంథని, దేగాం, మచ్చర్ల గ్రామాలలో సీతరాముల కళ్యా ణంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు. అదే విధంగా చేపూర్ గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో సీతరాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రుద్రూరు: రుద్రూరు మండల కేంద్రంతో పాటు అక్బర్‌నగర్, అంబం (ఆర్) గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్ క్యాంప్, ఆయా గ్రామాలలో బుధవారం శ్రీరామనవమి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమాలలో హనుమాన్ స్వాములు, పాల్గొన్నారు.

రెంజల్: మండల కేంద్రంతో పాటు తాడ్‌బిలోలి, నీలా క్యాంప్, కందకుర్తి, దూపల్లి, కళ్యాపూర్, కూనేపల్లి, బాగేపల్లి, వీరన్నగుట్ట, బోర్గాం గ్రామాలలో బుధవారం శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయమే ఆలయాలకు చేరుకుని వేద పండితులు శ్రీనివాస్ మంత్రోచ్ఛరణల మధ్య భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తాడ్‌బిలోలి రామాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సుధాకర్ రావు సతీమేతంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాము సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దత్తు రెడ్డి, సాయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా:మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాలలో శ్రీరామ నవమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్యక్రమంలో భాగంగా శ్రీరాముని విగ్రహాలకు అభిషేకం, హోమం, వేద మంత్రాలతో అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోస్రా రామాలయం ధర్మకర్త దినేష్ రెడ్డి దంపతులు, పురోహితులు శ్రీనివాస్, నవీన్, విజయ్, నరేష్, ధీరజ్, భజరంగ్ దళ్ కార్యకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట: శ్రీరామ నవమి వేడుకలను మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నవీపేట, అంజుమాన్ ఫారం, బినోల, జన్నేపల్లి, నిజాంపూర్, యంచ, అభంగపట్నం తదితర గ్రామాలలోని రామాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోటగిరి: కోటగిరి, పొతంగల్ మండలాల్లో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని రామాలయాలను ముస్తాబు చేశారు. సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండుగా సాగింది. మండలంలోని కోటగిరి, ఎక్లాస్‌పూర్ క్యాంప్, కొత్తపల్లి క్యాంప్, రాంపూర్, అడ్కాస్‌పల్లి, పొతంగల్, ఎత్తొండ క్యాంప్‌లలో శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండువగా సాగాయి.

నవీపేట: శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో హనుమాన్ స్వాముల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. సీతారామ లక్ష్మణ అంజనేయుడితో కూడిన భారీ చిత్రపటాన్ని ప్రత్యేక రథంలో ఉంచి మండల కేంద్రంలోని పుర వీధులలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున హనుమాన్ మాలధారులు పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సీతరాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ వేదంతం గోపికృష్ణశర్మ వారి శిష్యులతో కలిసి, అస్థాన పండితుడు కుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీని వాస్, స్థానిక కౌన్సిలర్‌లు, ఆర్మూర్ సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, సభ్యులు, అన్ని కులాల పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కోడిగెల మల్లయ్య, బోండ్ల ఆనంద్, అజారి సతీష్, పొద్దుటూరి చరణ్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, రవి, కొంతం మురళీ, అలిశెట్టి నరేష్, బట్టు శంకర్, ఆలయ కమిటీ, సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని ఎడపల్లి, ఏఆర్పీ క్యాంపు, జైతాపూర్, పోచారం, ఠాణాకలాన్ గ్రామాలలోనిశ్రీ రామ మందిరాలలో బుధవారం శ్రీ రామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అయా గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం శ్రీరామ నవమి వేడుకలను భక్తులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి భక్తులు, ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల ప్రజలు బుధవారం శ్రీరామనవమి వేడుకలను ఎంతో భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గ్రామ గ్రామాన వివిద ఆలయా ల్లో సీతారాముల కల్యాణోత్సవ కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విశ్వహిందుపరిశత్, ఆర్ ఎస్ఎస్, భజరంగ్‌దళ్ సభ్యులు, హనుమాన్ దీక్షపరులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్: శ్రీరామ నవమి సందర్భంగా భీమ్‌గల్ పట్టణంలోని రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండువగా కొనసాగాయి. మధ్యాన్నం 12 గంటలకు ఆలయాల్లో సీతారాముల కళ్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు భక్తుల భక్తి శ్రద్ధల మధ్య పూర్తిచేశారు. భీమ్‌గల్ పట్టణంలోని మోక్షానంద ఆశ్రమంలో, బాబాపూర్, బాబానగర్ రామాలయంలో, పిప్రి గ్రామంలోని రామలొద్దిలో కళ్యాణ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. కళ్యాణ ఘట్టాన్ని తిలకించడానికి రామలొద్దికి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లానాయకులు మానాల మోహన్ రెడ్డి హాజరయ్యారు. రామాలయాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయాగ్రామాల్లో సాయంత్రం సీతా రాముల శోభయాత్ర అంజన్న భక్తులు నిర్వహించారు.

మాక్లూర్ మండలంలోని డీకంపల్లి గ్రామంలో ఆలయంలో జరిగిన సీతరాముల కళ్యాణంలో బుధవారం జిల్లా పరిషత్ ఛైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో విఠల్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ శ్రీనివాస్, ప్రశాంత్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: మండలంలోని రెంజర్ల గ్రామంలో గల కోదండ రామాలయంతో పాటు బాల్కొండ మండలం కిసాన్‌నగర్ రామాలయంలో బుధవారం 12.30గంటలకు సీతరాముల కళ్యాణం అందరంగా వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

మెండోర: మండలంలో పోచంపాడ్ శ్రీ కోదండ రామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకల్లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంఓల ఎంపీపీ బురుకల సుకన్య కమలాకర్, జడ్పీటీసీ తలారి గంగాధర్, డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్, మచ్చర్ల రాజారెడ్డి, సామ గంగారెడ్డి, సాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండలంలోని కోమటిపల్లి, నడ్కుడ, డొంకేశ్వర్ గ్రామాలలో గ్రామాభివృద్ది కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రామాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతరాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ది కమిటీ సభ్యులుపాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలో రామ నవమి ఉత్సవాలను ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. స్థానిక రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా జరుపుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.







మత్తడి పోచమ్మ ఆలయం సమీపంలో ఎలుగుబంటి సంచారం



ఎలుగు బంటి సంచరిస్తున్న దృశ్యం

లింగంపేట, ఏప్రిల్ 17: లింగంపేట మండల కేంద్రంలోని చారిత్రక ఆలయం మత్తడి పోచమ్మ ఆలయం సమీపంలో ఎలుగుబంటి సంచరిస్తుందని భక్తులు భయాందోళన చెందుతున్నారు. ప్రతీ ఏటా ఉగాది పర్వదినం నుంచి ఐదు రోజులు పాటు జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఇటీవల జాతర ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల అనంతరం జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన భక్తుల కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు ప్రతీ రోజు అమ్మవారి వద్ద మొక్కులు తీర్చుకునేందుకు వస్తుంటారు. ఇదే క్రమంలో మంగళవారం లింగంపేట, ఐలాపూర్ గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకుని తమ ఇండ్లకు వెళ్లుతుండగా రాత్రి 7గంటల ప్రాంతానికే రోడ్డుపై ఎలుగుబంటి కనిపించడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని చూసి ఎలుగుబంటి సమీపంలోని అడవులలోకి పారిపోయిందని వారు తెలిపారు. ఆలయ సమీపంలో ఎలుగుబంటి సంచరించడం వలన భక్తులు, గ్రామసమీపంలోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెద్ద వాగులోను నీరు లేకపోవడంతో దగ్గరలోని పంట పొలాల్లో తాగునీటి కోసమే వస్తుందని వారు అంటున్నారు. అటవి అధికారులు స్పందించి ఎలుగుబంటిని బంధించి ఇతర అడవులలో వదిలి వేయాలని వారు కోరుతున్నారు.

నామినేషన్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు

మద్నూర్, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 18న నోటిఫికేషన్‌కు అధికారులు సన్నద్ధంచేస్తుండగా, నామినేషన్ల ఘట్టం మొదలు కానుంది. ప్రధాన పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో సర్వం సిద్ధమైంది. ఈ నెల 25వరకు మాత్రమే నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉండటంతో శుభమూహుర్తాలు, బలాలు చూసుకుంటున్నారు. వేద పండితులను ఆశ్రయిస్తూ తమకు అనువైనతేదీలు తెలుసుకుంటున్నారు. ప్రధాన పార్టీల నేతలు నామినేషన్ రోజు తమ సత్తా చాటేలా బారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18న నామినేషన్ల ఘట్టానికి తెర లేపనుండటంతో లోక్‌సభ సమరం వేడెక్కనుంది. తమ అభ్యర్థులు బలం, జన్మ నక్షత్రం ప్రకారం ఏ రోజు నామినేషన్ వేస్తే సత్ఫలితాలుంటాయని వేద పండితులను ఆశ్రయిస్తున్నారు. పార్టీ అధిష్టానం నుంచి వస్తున్న ఆదేశాల మేరకు నామినేషన్ల దాఖలుకు సిద్ధం అవుతున్నారు. 19, 23, 25 తేదిలు తిథి నక్షత్రాల ప్రకారం శుభ ఘడియలు కావని, ఆ రోజుల్లో నామినేషన్లువేయడం సబబు కాదని వేద పండితులు చెబుతుండటంతో 18, 20, 21, 22, 24 తేదిల్లో అభ్యర్థులు నామినేషన్లువేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.

బీర్కూర్‌లో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

బీర్కూర్, ఏప్రిల్ 17 : బీర్కూర్ మండల వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలను ప్రజలు వైభవోపేతంగా జరుపుకున్నారు. బీర్కూర్ మండల కేంద్రంలోని కోదండ రామాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా సీతారాముల కళ్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లలో భాగంగా సీతాసమేతుడైన శ్రీరామచంద్రుని ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయాలకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో భజాభజంత్రీలు, వేద మంత్రాలు, ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణాన్ని ఎంతో కమనీయంగా నిర్వహించారు. రామాలయాల వద్ద మహా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హాజీపూర్ తండాలో జగదాంబ మాతా, సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ పతిష్ఠాపనలో పాల్గొన్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 17 : ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన జగదాంబ మాత, సేవాలాల్ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠపన మహోత్సవాలను ఘనంగా ప్రారంభమైనట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మొదటి రోజు బుధవారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వర్గం, మాతృక, నవగ్రహ క్షేత్ర పాలక తదితర పూజా కార్యక్రమలు నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపనలో జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ హాజరయ్యారు. పూజారి రాజు పంతులు పాటిల్‌కు ప్రత్యేక పూజలు చేయించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా తండా పెద్దలు శా లువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షు లు నర్సింలు, నరేష్, గణేష్‌నాయక్, శంకర్, తులసి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బీర్కూర్, ఏప్రిల్ 17 : బీర్కూర్ మండలం భైరాపూర్ గేట్ వద్ద రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన నీరడి సాయిలు (45) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. లింగాపూర్ గ్రామానికి చెందిన నీరడి సాయిలు ద్విచక్ర వాహనంపై మంగళవారం బీర్కూర్ సంతకు వచ్చాడు. రాత్రి స్వగ్రామానికి వెళుతున్నాడు. సరిగ్గా భైరాపూర్ గేట్ వద్ద ఎదురుగా వెళుతున్న వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో సాయిలు తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్రంగా రక్తస్రావం జరిగింది. 108 వాహనంలో బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సాయిలు మృతి చెందినట్లు వైద్యులుపరీక్షించి చెప్పారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేయనున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

అడ్లూర్ ఎల్లారెడ్డి కాంగ్రెస్ నూతన కార్యవర్గం ఎన్నిక

సదాశివనగర్,ఏప్రిల్ 17:సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగారెడ్డి, జనరల్ సెక్రటరీ లక్ష్మీపతి, మండల యూత్ అధ్యక్షుడు అన్వేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాలమల్లఅశోక్, ఉపాధ్యాక్షుడి గా మోసర్లరాములు, సీతగారి రాజయ్య,తండరాజు, ప్రధానకార్యదర్శిగా ఆకుల కృష్ణ, కార్యదర్శులుగా బొల్లిపల్లి రాములు, ఎడ్లబాలరాజు, కోశాధికారిగా ఆస శంకర్, సోషల్‌మీడియా కన్వీనర్‌గా నితిన్‌గౌడ్,బీసీ సెల్‌అధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యాక్షుడిగా లింగం,ఎస్‌సెల్ అధ్యక్షుడిగా ఆస రాజయ్య, మైనార్టీసెల్ అధ్య క్షుడిగా అబ్దుల్ రహీం, సలహదారులుగా రెడ్డిసాయిలు, రమేష్‌,యూత్ అధ్య క్షుడిగా భరత్, ఉపాధ్యాక్షుడిగా భాను, ప్రధాన కార్యదర్శిగా రామ్‌శెట్టి కృష్ణలను కమిటీ సభ్యులు ఎన్నుకు న్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుకు నూతనకార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చలి వేంద్రం ప్రారంభించిన ఎస్సై

పెద్ద కొడప్‌గల్. ఏప్రిల్ 17: జుక్కల్ మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం జుక్కల్ ఎస్ఐ సత్యనారాయణ చలివేంద్రాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతు వేసవి కాలంలో మండల కేంద్రానికి వచ్చే ప్రజలు దాహార్తితో ఉంటారని, వారి దాహార్తిని తీర్చేందుకు పోలీస్ స్టేషన్ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంబించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అస్పత్‌వార్ వినోద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం


బాన్సువాడలో శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న మాజీ స్పీకర్ పోచారం


బిచ్కుందలో పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న ఎమ్మెల్యే

బాన్సువాడటౌన్, ఏప్రిల్ 17:శ్రీరామ నవమి సందర్భంగా పట్టణంలోని శ్రీరామ ఆలయంలో బుధవారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. వేదపండితులు మధుసూధనశర్మ , గిరీశశర్మ, మన్మోహన్‌శర్మలు వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారికి సుప్రభాత సేవ , అభిషేకాలు , అర్చనలు చేపట్టారు. ఉదయం 9 గంటలకు శ్రీరామచంద్రుని జనన కార్యక్రమం నిర్వహించారు. 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో శ్రీసీతారామచంద్రుల కళ్యాణ ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లు వివరించి చెప్పారు. రాయబారం , స్వయంవరం , కళ్యాణ మహోత్సవం గురించి భక్తులకు వివరించి చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తుల కోసం శ్రీనివాస్‌రావు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కళ్యాణ మహోత్సవంలో మాజీ స్పీకర్ , ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రతీ యేటా శ్రీరామ మందిరంలో కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. భక్తులు కూడా యేటేటా పెరుగుతున్నారని , ఇది ఇక్కడి పూజా కార్యక్రమాల ఫలం అన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని శాలువాకప్పి , జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఉమ్మడి జిల్లాల మాజీ డీసీసీబీ చైర్మెన్ , బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి పోచారం భాస్కర్‌రెడ్డిని కూడా సత్కరించారు. అదేవిధంగా రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్‌ను ఘనంగా సత్కరించారు. సాయంత్రం వేళలో పల్లకీ సేవ నిర్వహించారు. స్వామి వారికి ఏకాంత సేవ , మంగళహారతి , తీర్థప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కులకర్ణి రమాకాంత్‌రావు , ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణమూర్తి,తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మండల కేంద్రంలోని రామాలయంలో జరిగిన రామ నవమి ఉత్సవంలో జుక్కల్ శాసన సభ్యులు తోట లక్ష్మీకాంత్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామున్ని ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడవాలన్నారు. హక్కుల కంటే బాధ్యత గొప్పదని రామతత్వం బోధిస్తుందని, కష్టంలో కలిసి నడవాలన్నది సీత తత్వమని, కుటుంబ బాధ్యతలు ప్రజా బాధ్యతలు పంచుకోవాలనేది లక్ష్మణుని తత్వమని, తమని నమ్ముకున్నవారిని దేనికైనా సిద్ధమని హనుమంతుని తత్వం అనిగుర్తు చేశారు.ఆయనతో పాటు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిలు, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, సచిన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: శ్రీ రామ నవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అచ్చంపేటలోని రామాలయంలో పురోహితులు సంజీవ్ కుమార్ దంపతులు సీతారామ కళ్యాణాన్ని నిర్వహించారు. విగ్రహాలకు తలంబ్రాలు వేశారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో కూడా శ్రీ రామ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిజాంసాగర్ మండలం అచ్చం పేట, మహ్మద్‌నగర్, కొమలంచ తదితర గ్రామాల్లో కూడా శ్రీ రామ నవమి ఉత్సవాల సందర్భంగా ఎడ్ల బండ్లు, వీధినాటకాలు బుధవారం రాత్రి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించనున్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఉదయం నుంచి సీతారాముల వారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ధర్మకర్తలు దంపతులు సిద్ధి చక్రధర్ ప్రకాష్, శ్రీధర్, భైరవ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో మధ్యాహ్నం సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పా టిల్, మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు, బాణాల లక్ష్మారెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: మండలంలోని దేశాయిపేట్ , కొల్లూర్, తిర్మలాపూర్, బాన్స్‌వాడ పట్టణంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్ర మంలో మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి,నాయకులు కృష్ణారెడ్డి, జిన్నా రఘు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు

● ఘనంగా రాములోరి కల్యాణం

పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంతో పాటు, మండలం లోని ఆయా గ్రామాలలో శ్రీరామ జననం, శ్రీరామ కళ్యాణం వేడుకలు అం గరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీరామ జననం కార్యక్రమా న్ని నిర్వహించి, మధ్యాహ్నం శ్రీరామ కళ్యాణం జరిపించారు. ఆయా గ్రామాలలోని హనుమాన్, శ్రీరామ ఆలయాల్లో ఉదయం నుండి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి శ్రీరామ జననం, కళ్యాణం తిలకించేందు కు భక్తులు ఆలయాలకు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే బ్రాహ్మణోత్తములు స్వామి వారి జననం, కళ్యాణం కార్యక్రమాలను జరిపించారు.ఇక పెద్ద కొ డప్‌గల్ రామాలయంలో నిర్వహించిన శ్రీరామ కళ్యాణ వేడుకల్లో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావ్ పాల్గొని స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు.

మాచారెడ్డి: మాచారెడ్డి,పాల్వంచమండలాల్లో శ్రీరామనవమి వేడుకలను ఆయా గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అక్కాపూర్ శాంతా ఆనంద తపన ఆశ్రమంలో,పాల్వంచ మండలంలో సీతారాముల కల్యాణం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అంగరంగ వైభ వంగా నిర్వహించారు.అక్కాపూర్ లో ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు అనిత దంపతులు పాల్గొన్నారు.

బిచ్కుంద: శ్రీరామనవమి సందర్భంగా గ్రామగ్రామన శ్రీరాముని కల్యాణమ హోత్సవాన్ని కన్నులపండుగగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మింజర బాలాజీ మందిరం నుండి సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకుని వచ్చారు.ఈ కార్యక్రమంలో సద్గురు బండాయప్ప మఠ సంస్థాన్ పీఠాధిపతులు సోమలింగ శివాచా ర్యులు, ఎంపీపీ అశోక్‌పటేల్, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ అప్పశెట్కార్, విఠల్‌రెడ్డి, ఎంపీటీసీ సురేష్, నాగనాథ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు

బీబీపేట: బీబీపేట మండల కేంద్రంతో పాటు యాడారం,తుజాల్ పూర్, మల్కాపూర్, ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి, మందాపూర్,కోనాపూర్ గ్రామాలలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పండుగను పురస్కరించుకుని ఉదయం నుంచే భక్తులు దేవాలయాలకు పోటెత్తారు. అనంతరం భక్తులు సీతారాములకు ఓడిబియ్యాన్ని పోశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలో రామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. బుధవారం మండల కేంద్రంలోని రామ మంది రంలో, మండలంలోని బాణాపూర్, మోతె, పొల్కంపేట గ్రామంలోని రామాలయంలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేద మంత్రాలతో శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. లింగంపేటలో ఎడ్లబండ్ల ప్రదక్షణ ఉత్సవాలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో ప్రజా ప్రతి నిధులు,ఆలయకమిటీ సభ్యులు,భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సదాశివనగర్:మండల కేంద్రంలోని కాశీవిశ్వేశ్వరాలయం వద్ద కుప్రియల్ రామాలయంలో రాముల వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను గ్రామంలోని వీధులలో ఊరేగింపు నిర్వహించి ఆలయాల వద్ద ఏర్పాటుచేసిన ముత్యాల పందిరిలో వేద పండితుల మం త్రోత్సవాలతో ఘనంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు భక్తులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండల కేంద్రంలోని శ్రీశబరీమాత ఆశ్రమంలో శ్రీరామ నవమి పండుగ సందర్భంగా బుధ వారం శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కళ్యాణమహోత్సవకార్యక్రమాన్ని నిర్వహించారు. చుట్టు ప్రక్కల మండలాలు, గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశబరిమాత ఆశ్రమ ట్రస్ట్ నిర్వహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గాంధారి:మండలంలో బుధవారం సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శ్రీరాముని విగ్రహాన్ని ఊరేగింపు చేపట్టారు. కళ్యాణమహోత్సవంలో వేదపండితులు భరత్ భూ షణ్‌జోషి ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాముల వారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని వెంకట్‌గౌడ్ చేపట్టారు.

దోమకొండ: మండల కేంద్రంలోని శివరాంమందిర్ ఆలయంతో పాటు గొట్టిముక్కుల గ్రామంలో బుధవారం శ్రీ రామ నవమి సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహిళలు ఎద్దఎత్తున సీతారాముల వారికి ఓడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, నాగరాజు, ఆలయ కమిటీ చైర్మన్ అబ్రబోయిన రాజేందర్, కార్యనిర్వహణధికారి ప్రభు, నల్లపు అంజలి శ్రీనివాస్,గజవాడ రాజేశ్వర్ పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: మండలంలో శ్రీరామ నవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా మండల కేంద్రంలో దేవతా విగ్రహాలతో పల్లకి సేవ ఊరేగింపు కార్యక్రమాన్ని రామాలయం వరకు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి మండలంలోని వివిధ గ్రామాల భక్తులు, మహిళలు వందలాదిగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొలుగు అంజయ్య, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

భిక్కనూర్:మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను బుధవారం మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,పెద్దఎత్తున పాల్గొన్నారు.


అచ్చంపేటలో కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


లింగంపేటలో రామాలయం వద్ద ఎడ్ల బండ్ల ప్రదక్షణ

పులకించిన భద్రగిరి



భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక


కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం


స్వామివారి ఊరేగింపు


ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు


గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



గూడు లేని వారి చూపు ఇందిరమ్మ ఇళ్ల వైపు


మండలంలోని నివసిస్తున్న పూరి గుడిసె

మద్నూర్,ఏప్రిల్ 17: ఇటీవల జుక్కల్ శాసన సభ్యులు తోట లక్ష్మీకాంత్ రావు ఆయా గ్రామా ల్లో ఎన్నికల తర్వాత అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తా మని హామీ ఇవ్వడంతో గ్రామీణ ప్రాంతాలలో గూడు లేని పేదలు ఇందిరమ్మ ఇళ్ల వైపు చూస్తున్నారు. తెలం గాణ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ఆవిష్కరించి, ముఖ్యమంత్రి సాను కూలంగా మాట్లాడుతుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం గూడు లేని పేద ప్రజలకు ఎంతగానో ధైర్యాన్ని ఇచ్చింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇళ్లు లేకుండా ఉండి, అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి కట్టుకునే విధంగా ప్రోత్సహిస్తామని క్షేత్రస్థాయిలో నేతలు, నాయకులు భరోసా ఇస్తుండటంతో పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్ రూంలు ఇస్తామని 10 సంవత్సరాలు కాలం వెల్లదీయడంతో ఎక్కడా అర్హులైన వారికి ఇళ్లు ఇవ్వకపోవడంతో అందరూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్కొక్క నియో జకవర్గానికి రూ.3వేల నుంచి 4వేల వరకు ఇళ్లను మంజూరు చేయిం చి ఒక్కొక్క లబ్ధిదా రునికి రూ.5 నుంచి రూ.6 లక్షలు ఆర్థిక సహాయం అందిం చేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆవిష్కరించి, కుటుంబాల ప్రాతిపదికన అర్హులైన వారికిఇళ్లను మంజూరు చేయడంతో పాటు వారికి అన్నివిధాల అండగా ఉంటామని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

కాంగ్రెస్‌పార్టీతోనే అభివృద్ధి సాధ్యం


మండల కేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

గాంధారి,ఏప్రిల్ 17: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మండల కాంగ్రెస్ నాయకులు కోరారు.బుధవారం గాంధారి మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజులు, రమేష్, బాలయ్య, ఈశ్వర్‌గౌడ్, బాలరాజ్, రవి, మదర్, భాగ్యనాయక్, సంఘనిబాబా తదితరులు పాల్గొన్నారు.

కనిపించకుండా పోయిన ఇద్దరు చిన్నారులు


పాఠశాల నుంచి వెళ్లిపోయిన గంగోత్రి,నజియాలు

కామారెడ్డిటౌన్,ఏప్రిల్ 17: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హరిజన వాడ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు బాలి కలు గంగోత్రి, నజియాలు కని పించ కుండా పోయినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వీరు ఇరువురికి తల్లిదండ్రులు లేకపోవడం తో బాలసదనంలో ఉంటూ హరిజనవాడ పాఠ శాలలో చదువుకుంటున్నారని తెలిపారు. ఈనెల 13 న యాధావిధిగా పాఠశా లకు వెళ్లిన బాలికలు పాఠశాలలో ఉపాధ్యాయులకు చెప్పకుండా బయటకు వెళ్లిపోయారు. వారి గురించి చుట్టు పక్కల వెతికిన జాడ తెలయకపోవ డంతో బాలసదనం ఇన్‌చార్జ్ గంగుబాయి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసున మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గతంలో గంగోత్రి అనే బాలిక రెండు సార్లు వెళ్లిపోగా వెతికి తీసుకువచ్చారని వీరి ఆచూకీ తెలిసిన ఎవరైనా కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు.

వనదుర్గ పెద్దమ్మ 26వ వార్షికోత్సవం

దోమకొండ, ఏప్రిల్ 17: మండల కేంద్రంలోని శ్రీ వనదుర్గ పెద్దమ్మ 26వ వార్షికోత్సవం 18 గురువారం నుంచి 21 ఆదివారం వరకు వార్షికోత్సవ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పున్న లక్ష్మణ్ తెలిపారు. 18న గురువారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, 19న శుక్రవారం పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణం, అనంతరం అమ్మవారికి ఓడిబియ్యం సమర్పణ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, 20న శనివారం సాయంత్రం 7 గంటలకు అమ్మవారికి బోనాల సమర్పణ, 21నఆదివారం ఉదయం 9 గంటలకు తిరుగు బోనాల కార్యక్రమాలు ఉంటాయన్నారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెద్ద బాలయ్య, సత్యం, రాజు, క్రిష్ణా పాల్గొన్నారు.

అజామాబాద్ గ్రామంలో నూతన కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 17: ఎల్లారెడ్డి మండలంలోని అజామాబాద్ గ్రామంలోని 231వ బూత్‌లో బీజేపీ నూతన కమిటీని ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. గ్రామ బూత్ అధ్యక్షులుగా రావుల కృష్ణ, రవి గౌడ్, అశోక్, సాయి చరణ్, ప్రవీణ్, నవీన్, సాయిరాం, రమేష్, యువ మోర్చ గ్రామ కమిటీ అధ్యక్షులుగా తుపాకి సాయిలు, అనిల్, చరణ్, విష్ణు, క్రిష్ణమూర్తి, తదితరులను నియమించారు.

'దేశాభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలి'


భైరాపూర్‌లో ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న యువకులు

బీర్కూర్, ఏప్రిల్ 17: అవినీతి రహిత పాలన కోసం, దేశా భివృద్ధి కోసం బీజేపీ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఎంపీ బీబీ పాటిల్ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారా యణ, జిల్లా అధ్యక్షురాలు అరుణ తారలతో కలిసి భైరాపూర్‌కు విచ్చేశారు. ఆయన సమక్షంలో గ్రామానికి చెందిన యువకులు బీజేపీ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయన వెంట మండల అధ్య క్షుడు సాయి కిరణ్, మండల ఇంచార్జి మక్కన్న, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్‌లో బీజేపీ కార్యాలయం ప్రారంభం

నసురుల్లాబాద్, ఏప్రిల్ 17 : కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని బొమ్మన్‌దేవ్ పల్లి క్రాస్ రోడ్డు లో బుధవారం నసురుల్లాబాద్ మండల భారతీయ జనతా పార్టీ కార్యాలయంప్రా రంభించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, జిల్లాఉపా ధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణ, నసురుల్లాబాద్ మండల అధ్య క్షులు సాయిలు, ప్రధాన కార్యదర్శులు జిల్లానాయకులు వడ్ల సతీష్,హన్మాండ్లు,కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- లవ్‌గురు
శాంతి	- టిల్ స్క్వేర్
ప్రియా 70	- ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35	- గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ

మహేశ్వరి	- ది ఫ్యామిలీ స్టార్
వెంకటేశ్వర	- లవ్‌గురు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

